అంతర్జ్వాల

వ్యధతో బరువెక్కిన మనస్సును సంబాళించుకోటానికి ప్రయత్నించింది. అవమానంతో ముక్కలయిన హృదయాన్ని అతకటానికి విఫలంగా ఆలోచిస్తోంది. అభిమానంతో ఆవేశ పడుతున్న అంతర్యాన్ని ఊరడించలేక తల్లడిల్లిపోతోంది వత్సల. శరీర మంతా ప్రగాఢమయిన అసహ్యతతో వొణుకుతోంది. "ఎంత సంకుచిత మనస్తత్వం? చిన్న చిన్న విషయాల్లో కూడా తమ ఆధిక్యతను చూపెట్టుకోటానికి ఈ మగవాళ్లు విశ్వప్రయత్నం చేస్తారు. తనేం చేసిందని! హృదయానికి ప్రతిబింబం డైరీ! డైరీ వ్రాసుకోవటం తప్పా? ఆమాత్రం స్వాతంత్ర్యం అధికారం లేవా తనకు? ఎవరి మనస్తత్వం వారిది. బలవంతంగా హృదయాన్ని మెలిపెడితే – ఎలా అల్లాడిపోతారో తెలియని కఠిన హృదయమా తోటి మనిషిది? పురుషులది విశాల హృదయ మంటారే – ఇదేనా? భగవాన్! స్త్రీని ఇంత అవమానకరంగా ఎందుకు సృష్టించావ్!" బాధగా కణతలు నొక్కుకుంది వత్సల. తన జీవితానికి పర్యాయపద మైన డైరీల వంక చూసింది. "డైరీ! డైరీ వ్రాయటమంటే తన కెందుకింత అభిలాష!! జ్ఞానం తెల్సిన దగ్గర్నుంచీ ఈ డైరీ ఎందుకిలా తన్ని ఆకర్షించింది? ఈ ఆసక్తి తనలో లోపిస్తేనే తన జీవితం సుఖప్రద మయేదేమో?" తన చిన్నతనంలో జరిగిన సంఘటన గుర్తొచ్చింది వత్సలకు.

తన కప్పటికి ఆరేళ్లు వుంటాయ్. తెల్ల కాగితాలు ముక్కలుగా చింపి పుస్తకం ఓపిగ్గా కుట్టుకుంది. పెన్సలుతో తనకు తోచిన ముక్కలు వ్రాసి తన పుస్తకాల షెల్ఫులో భద్రంగా పెట్టి ఆటలకు వెళ్ళింది. ఇంతలోనే శశి అన్నయ్య నవ్వు విన్పించింది. ఇంట్లో వున్న జనం అంతా పోగయ్యారు. అందరి ముఖాలలోని ఆత్రం చూసి కొంచెం సిగ్గుపడ్డాడు శశి. తను అమ్మ కుచ్చెళ్లు పట్టుకుని చూస్తూ నిల్చుంది. "ఏమిటా వెట్టి నవ్వు? అమ్మ గాభరాగా అడిగింది. "చిట్టి చూడమ్మా! డైరీ వ్రాసింది." మళ్ళీ ఉప్పెనలా నవ్వు! తను చిన్నబోయిన వదనంతో అన్నయ్య వైపు చూస్తోంది. ప్రొద్దున్నే నిద్ర లేచితిని – మొహంకడిగితిని – స్నానం చేసితిని–" తెరలు–తెరలుగా నవ్వుతూ

గొల్లపూడి రాజ్యలక్ష్మి

చదవటం మొదలెట్టాడు. పట్టలేని కోపం ముంచుకొచ్చింది. అన్నయ్య చేతిలోని పుస్తకం లాక్కుని ఉక్రోషంతో ముక్కలు — ముక్కలుగా చింపింది. తను కళ్ళల్లో నీళ్ళు నిండుతూంటే అమ్మ ఒడిలో తల దాచుకుని బావురు మన్నది. అమ్మ ఆప్యాయతతో తన వీపు నిమురుతూ, "అన్నయ్యను

మందలించింది. "దీని సంగతి నీకెందుకురా? ఇది చూడు ఎలా ఏడుస్తున్నదో?" పౌరుషంగా అన్నది తను - "నువ్వు వ్రాసుకోవటంలేదా డైరీ? నేనూ అంతే!" అన్నయ్య తన మాటలకు తిరిగి నవ్వుతూ "అలా కాదమ్మా! నేను నేర్పుతా లే!" అన్నాడు అనునయంగా. తన జీవితంతో పెనవేసుకునిపోయిన డైరీ కథ అలా ప్రారంభమయింది. ఆలోచనలతో - బాధాతప్తమయిన మనసుతో శూన్యంలోకి చూస్తూ కూర్చుంది వత్సల. పరిచితకంఠంతో వాస్తవానికి అడుగెట్టి తలుపు తీసింది. భాస్కరం వత్సల వదనం చూసి విస్మయపడ్డాడు. టేబిల్ మీద వున్న డైరీలను చూసి చిన్నగా నవ్వుతూ "ఇంకా ఆ పిచ్చి పోలేదా! రాసిన గ్రంథం చాలు! చింపి తగలెయ్!" అన్నాడు

వత్సల మనసు ఉడికిపోతోంది. నా డైరీలు చూడాల్సిన అవసర మేమిటి?" అతిప్రయత్నంమీద అడిగింది.

"ఏం? చూడకూడదా?"

"సభ్యత తెలిసిన మనిషి చేయదగిన పనికాదు!"

యింది వత్సల. "ఎమ్. ఏ. చదివాడు. విశాలభావాలు కనపర్చాడు; నిజంగా తన అదృష్టం అని మురిసిపోయింది. వాటి వెనుక నున్న ఈ భయంకర బలహీనతలు తను గుర్తించలేదు. ఇంత సంకుచితభావాలు దాగివున్నాయని తా నేనాడూ వూహించలేదు."

"కాఫీ ఇచ్చే దేమన్నా వుందా?"

ఉలిక్కిపడి లేచి ఫ్లాస్కులోంచి కప్పులోకి వంచి ఇచ్చింది.

"చూడు వత్సలా! ఈ డైరీ వ్రాయకపోతే ఏం? వ్రాయకుండా నేను బ్రతకటంలేదూ?"

"అన్నం తినటం ఎలా అలవాటు- ముఖ్యమో-అలాగే నాకు అలవాటు అయింది. మీరు కాదన్నంతమాత్రాన మానటం అసంభవ మన్పిస్తోంది. నా ప్రాణంతోపాటే ఆ డైరీ కూడా..." కంఠం కంపించింది. అభిమానాన్ని కూడదీసుకుంటూ తిరిగి అన్నది. "ఐనాఅది నాపర్సనల్, ఈ విషయంలో మీరు ఇంటర్ ఫియర్ అవతగదు."

భాస్కరం రుద్రు డయ్యాడు. అవును లే! చదువుకున్న దానివి. ఉద్యోగం వెలిగిస్తివి. నా మాటంటే

భాస్కర మేనా? కాదు! కాదు!! ఇతనిలో ఏదో ఆవేశించి వుంటుంది!— అవును! స్త్రీ నిజంగా ఎప్పటికీ పురుషుడికి లోకువే! ఎన్నో సాధించా లనుకుంటారు స్త్రీలు అంతా భ్రమే!" అక్కడ నిలువ లేక తన గదిలోకి వెళ్లిపోయింది వత్సల. బాలీసు నానుకొని కిటికీలోంచి చూస్తూ కూర్చుంది భాస్కరం తలుపులు మూసి వెళ్ళిపోయిన చప్పుడయింది. భారంగా నిట్టూర్చింది. గత పదిసంవత్సరాలుగా వ్రాసుకున్న డైరీలు తీసుకున్నది, అగ్గిపెట్టె దగ్గర పెట్టుకుంది జరగబోయేది తల్చుకుంటుంటే మనసు మండిపోతోంది — హృదయం ఘోషిస్తోంది — పెదాలు వణుకుతున్నయ్ — చేతులు కంపిస్తున్నయ్ "భగవంతుడా! నా జీవితానికి ఎంత దుర్దశ కల్పించావు! నా ప్రాణం కోరినా సంతోషంగా అర్పించేదాన్నే! ఇంతకంటె శిక్ష ఏం కావాలి? ఇంతకంటె నరకం నేనేం అనుభవించాలి?— నా జీవితంలో జరిగిపోయిన మధుర క్షణాలూ — కన్న కలలూ — పొందిన అనుభూతులూ — అనుభవాలూ — నా చేతుల్తోనే తుదముట్టించే దుర్దశ ఎందుకు కల్పించావు?— నిజంగా ఇంతకంటె మనిషికి మృత్యువు వేరే వుంటుందా!" దుఃఖావేశంతో మనసు వశం తప్పుతోంది. కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా అలాగే వుండిపోయింది. "ఎందుకింత బెంబేలు పడిపోతోంది తను! అతనికి అయిష్టమైన పని ఎన్నటికీ చేయలేదు. ఎంత దుఃఖించీ ఏం ప్రయోజనం? ఈ సంఘటనలవల్ల అతని బలహీనతలు మాత్రం బయటపడయ్ — అంతే! — ఈ డైరీలతో బాటే నా జీవితమే కాలిపోయిం దనుకుంటాను." మళ్ళీ దుఃఖం ముంచుకొచ్చింది. భారంతీరేలా వెక్కివెక్కి ఏడిచింది. తను మోసపోయింది! ఘోరంగా మోసగించబడ్డది! ఇంత చిన్న విషయానికి తన అధికారాన్ని ప్రదర్శిస్తా డని తను ఎన్నడూ అనుకోలేదు. ఇందులో తన పొరపాటు ఎంతమాత్రం లేదు ఆ రోజున తన ఉద్దేశాలన్నీ నిరభ్యంతరంగా బయట పెట్టింది. అన్నిటికీ తను సుముఖంగా వున్నట్లు అలా నటించటం దేనికి? ఆ రోజున...ఛీ తల్చుకుంటే అంతా అసహ్యమే!"

రిజల్ట్సు వచ్చాయి ఫస్టుక్లాసులో పాసయింది తను. అంతా అభినందించారు. పిన్ని అడిగింది. "ఎమ్. ఏ. చదువుతావా చిట్టీ?" అని. నిజమే! ఇప్పుడు తను ఏంచేయాలి? చదవటమా, విరమించటమా? ఇది ఆలోచించాల్సిన విషయమే. రాత్రి భోజనాలయిన తర్వాత డాబా పైకి వెళ్ళితే— వెన్నముద్దలాంటి వెన్నెల — గాలికి కొబ్బరి ఆకులు అందంగా కదులు

తున్నయ్. శశిఅన్నయ్య అడిగాడు. "చిట్టీ! ఏం చేయదల్చుకున్నావే?" ఏం చెప్పాలి! మనసులో చదువుదామని అంత ఉత్సాహంగా లేదు — పెళ్ళి మీద మనసు మళ్ళటం లేదు. ఎమ్. ఏ. జాయిన్ అవుతావా?"

"ఇంకేం చదవాలని అనిపించటం లేదురా!"

"పోనీ - ఉద్యోగం చేస్తావా?"

"అంత తేలిక కాదుగా!"

చిన్నగా నవ్వాడు అన్నయ్య. "ట్రై యువర్ లక్!"

"నాకు టైపు నేర్చుకోవాలని వున్నది." నెమ్మదిగా తన ఇన్‌టెన్షన్ బయటపెట్టింది.

"గుడ్ అయిడియా! అలాగే కానీ!" మనసు తేలికపడింది.

కాఫీ త్రాగుతూ నాన్నతో నెమ్మదిగా ప్రారంభించాను "టైప్ నేర్చుకుంటాను నాన్నా!" అమ్మ మండిపడింది. "నీ కెందుకే టైపులు? చదివింది చాలు! తెచ్చిన సంబంధంతో లక్షణంగా పెళ్ళి చేసుకో! పిచ్చివేషాలు వేయక!" అమ్మ వెర్రికి నవ్వొస్తోంది. "నీకు తెలియదులే అమ్మా! నేనెప్పటికయినా టైపిస్టు నవాలి!" అమ్మ వదనంలో ఆశ్చర్య ఆవేశ కావేషాలు ప్రతిఫలిస్తున్నయ్. "నన్నడిగితే ఆడదానికి చదువు అనవసరం. మితిమీరిన షోకులు పోయి, నేర్చుకున్నా - మాకంటే ఎక్కువ తెలివితేటలు ఏమీలేవు. ఇక ఉద్యోగాలు చేసి నలుగురినోళ్ళల్లో నాని..." అమ్మ గంభీరోపన్యాసం నాన్న అదలింపుతో స్టాప్ అయింది. "నీ పాతభావాలూ-నీవూ-ఇంకమాట్లాడకు! చిట్టి తప్పకుండా ఉద్యోగం చేయవల్సిందే!" నా మనసు ఆనందంతో గంతులు వేసింది. నాన్న అండవుండగా తను సాధించలేని దేమిటి? తప్పకుండా తన కోర్కె నెరవేరుతుంది.

బస్‌స్టాండ్ దగ్గర బస్‌కోసం నిరీక్షిస్తున్న తన్ని ఎవరో పేరుపెట్టి పిలుస్తున్నారు. వెనక్కి తిరిగిచూస్తే— అతను - రామమూర్తి! తనతోపాటే టైప్ నేర్చుకుంటున్నాడు. తటపటాయిస్తూ అడిగాడు "మీతో రెండు క్షణాలు మాట్లాడాలి." సందేహంగా చూశాను. "మే ఐ స్పీక్ టు యు ఫర్ ఫైవ్ మినిట్స్ ప్లీజ్!" పిచ్చవెధవ! తనకు తెలుగు తెలియదనుకుంటున్నాడా? జనం పల్చగావున్నచోట నిల్చున్నాం. రామమూర్తి చొరవకు ఆశ్చర్యం ముంచుకొస్తున్నది — "నా మాటలు శాంతంగా వినండి. కోపం తెచ్చుకోవద్దు. నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను." నింపాదిగా అన్నాడీ మాటలు. ఇంత సుల్లీగ్గా పాఠం వప్పజెప్పినట్లు అన్న అ మాటలు వినగానే నవ్వువచ్చింది. బలవంతాన అణుచుకుని వెనక్కి తిరిగివచ్చేశాను. తోటి

ఆడపిల్లను చూడగానే ఈ మగజీవులకు ప్రేమలూ - జబ్బులూ పుట్టుకొస్తాయి. వాటికి చెప్పుదెబ్బలే తగినమందు! కాని రెచ్చిపోతే ఫలితం - అల్లరంతా ఆడదే అనుభవించాల్సివస్తుంది నిజమే, ఈ అల్పుచూసే వీళ్ళిట్లా పెట్రేగిపోవటం.

షైవ్‌మిషన్ ముందు కూర్చుంటూంటే రామ్మూర్తి ప్రశ్నార్థకంగా చూస్తున్నాడు. వళ్ళు మండిపోయింది. కాలి కున్న చెప్పుని చేత్తో చూపించే సరికి, అతను వంచిన తల ఎత్తలేదు.

* * *

హిణి పెళ్ళయింది. అత్తగారింటి కెళ్ళేముందు వచ్చింది. ఇద్దరం డాబా పైకి వెళ్ళాం. "నీ పెళ్ళి ఎప్పుడు ?'' అడిగింది.

"ఇంకా ఆ అవసరం నా కన్పించటము లేదు !''

"అవసర మేమిటి చిట్టీ! ఎప్పటి కయినా చేసుకోవాల్సిందేగా !''

"అదేమన్నమాట ! చేసు కోవా లన్న నియమం ఏమిటి ?"

పూర్వులు పెట్టిన నియమం వెర్రిగా వుందా ?''

"కాక ?"

"ఓహ్! ఇలా అన్నవాళ్ళే ఏడాదికి ఇద్దర్ని కంటున్నారు."

"ఛ! మరీ అంత మోటుగా మాట్లాడకు!"

"సరే! నాజూగ్గా చెప్పనా?" నవ్వింది.

"ఆ టాపిక్ వదిలేద్దాం!" అయిష్టత వ్యక్తపరిచాను.

"టైప్ పూర్తయిం తర్వాత ఏం చేస్తావ్?"

"ఉద్యోగం!"

"తర్వాత?"

"సంపాదించటం!"

"తర్వాత?"

కోపంగా చూశాను. పగలబడి నవ్వుతోంది.

"వెర్రి ఆశయాలకు పోయి జీవితాన్ని నరకం చేసుకోక! పిచ్చిదానా! నీపాటి తెలివితేటలు లేకనా - పూర్వులు పెళ్ళిళ్ళూ - పేరంటాలూ పెట్టింది? వా రెప్పుడూ తప్పటడుగు లేయరు! ఎందులోనూ పొరపాటు పడరు. ఆడపిల్లకి నీడ ముఖ్యం! అది లేకపోతే ఆ పాట్లు అనుభవైకవేద్యం!"

"వాళ్ళ తరుపున వకాల్తా పుచ్చుకున్నావా?"

"నిజం చిట్టీ! ఆలోచిస్తే - ఈనాటి స్త్రీలు ఏదో సాధించా లనుకుంటారు కాని కూర్చున్నచోటునుంచి అవగింజంతయినా జరగలేదు!"

విసుగ్గా లేచాను "నీకు రుచించటము లేదుకదూ! అప్పుడు కాదంటే! నీకు తర్వాత తెలుస్తుంది!" వీణ వెళ్ళిపోయింది. ఆమె మాటలు ప్రతిధ్వనిస్తున్నాయ్. ఎంతమటుకు నిజం?

టైప్ పరీక్షలు పూర్తయ్యాయి. అన్నయ్యే అన్నాడు - షార్ట్‌హాండ్ నేర్చుకోమని. ఈసారి అమ్మ మారు పలుకలేదు.

ఏమీ తోచటం లేదు. తోటలో కెళ్ళాను. సన్నజాజులు కొద్ది కొద్దిగా విచ్చుకుంటున్నయ్. మాలతీ - మాధవీ గాలికి వూగుతున్నయ్. చంపకం విరబూసింది. లిల్లీసుగంధం అంతటా వ్యాపిస్తోంది. విరజాజు లన్నీ కోసి కూర్చుతూ కూర్చున్నాను. అన్నయ్య కంఠం వినిపించింది. అన్నయ్య ప్రక్క అతను! పరిచయం చేశాడు. నమస్కరించాను. విశాలనయనాలూ, చక్కని నుదురూ - చిన్న నోరూ - ఆకర్షవంతంగానే వున్నాడు. సరదాగానే మాట్లాడాడు. రాత్రి డైనింగ్ టేబిల్ దగ్గిర అన్నయ్య అన్నాడు. "భాస్కరానికి చిట్టి నచ్చిందిటమ్మా!" ఆశ్చర్యంతో చూశాను. నవ్వుతున్నాడు. "నేనప్పుడే పెళ్ళి చేసుకోను." ఖచ్చితంగా చెప్పాను. అమ్మ కోప్పడింది. "ఇంకెప్పుడు? ముందు కాళ్ళు ముసలమ్మ



వయిన తర్వాతనా?" నాన్నవైపు చూశాను. నిర్లిప్తతగా వున్నారు. అంటే? నాన్నకీ ఇష్టమే? అన్నం సయించలేదు. కంచంలో చెయ్యి కడుక్కుని వచ్చేశాను. అమ్మ అంటోంది. "పెళ్ళయిన తర్వాత కానీ ఈ వేషాలన్నీ తగ్గవు?" ఛీ! అంతా తనకు శత్రువులే! కన్నతల్లి కూడా కూతురి మనస్థితిని, అర్థం చేసుకోలేదు. అమ్మ పెళ్ళి చేసుకుని ఏం సాధించింది? తనేం సాధించాలి? ఇలా వుండిపోతే నష్టమేమిటి? — తల నెప్పితో పగిలిపోతోంది.

మెలుకువ వచ్చేసరికి చాలా పొద్దెక్కింది. వళ్లంతా నెప్పులుగా వున్నయ్. లేవబుద్ధి పుట్టడంలేదు. డ్రాయింగ్ రూంలో నాన్నెవరితోనో మాట్లాడుతున్నాడు? అన్నయ్య కంఠంకూడా వినిపిస్తోంది. కళ్లు మూసుకు పడుకున్నాను. "వత్సలాదేవి!" గాభరాగా కళ్ళు విప్పాను. అతను! భాస్కరం!! ఏమిటీ చొరవ? ఎంత సాహసం!!

"అలా వున్నారేం?"

"కొద్ది ఒళ్లు నెప్పులుగా వున్నయ్!" ఆశ్చర్యం వేస్తోంది. నేనేనా ఇంత సౌమ్యంగా మాట్లాడింది? కుర్చీ లాక్కుని కూర్చున్నాడు. వారించలేకపోయాను.

"మీ ఫామిలీ డాక్టరెవరు?"

"నరేంద్రఘోష్!"

"ఫోన్ చేయనా ?''

''నో ప్లీజ్."

అన్నయ్య వచ్చాడు. ''చిట్టీ అలా వున్నావేం ?" మాట్లాడబుద్ధి పుట్ట లేదు. ఇదంతా అన్నయ్య పన్నాగమే! వాళ్ళద్దర్నీ గదిలో వదిలేసి ఎలాగో బయటపడ్డాను. ఏమిటి వీళ్ళ ఉద్దేశం?

అన్నయ్య చెప్తున్నాడు. "భాస్కరం ఎమ్. ఏ పాసయి లెక్చరర్ చేస్తున్నాడు. అందంగా వుంటాడు. సహృదయుడు - చిట్టీ నిజంగా సుఖ పడుతుంది!'' దుఃఖం కట్టలు త్రెంచు కోటానికి ప్రయత్నిస్తున్నది. ఏమిటి వీళ్ళ ప్రవర్తన ? తన కిప్పుడు పెళ్ళి వద్దంటుంటే ఏమి టీ ధోరణి ? డాబా మీద అన్నయ్యతో అదే అన్నాను దృఢంగా. ''నేను చేసుకోను!''

''అతడు నచ్చలేదా ?"

కళ్ళల్లో భాస్కరం మెదిలాడు. నూతనకళతో మెరిసే ఆ నయనాలూ, చిరునవ్వును చిందించే ఆ పెదాలూ -

"ఏం మాట్లాడవేం ?''

''అసలు నాకు పెళ్లే వద్దంటుంటే నచ్చటం ప్రసక్తి ఎందుకు?" నవ్వాడు. "చిట్టీ ! నన్ను తప్పించుకోలేవు ! నీ ఆశయం నాకు తెలుసు. ఉద్యోగం చేయాలనే కదా ? నీ భావాలకు అతని భావాలు చక్కగా మేచ్ అవు తాయి. అతని ఉద్దేశంకూడా తన కాబోయే భార్య ఉద్యోగం చేయా లనే !'' ఆలోచనలు ఈగల్లా ముసురు తున్నయ్. నిజంగా అంత విశాల భావాలు కలవాడా ? స్త్రీ బానిస కాదనీ - ఆమెకూ ఒక వ్యక్తిత్వ మున్నదనీ గ్రహించగలడా! తనకు తగినంత స్వేచ్ఛ ఇస్తాడా ?

"ఆలోచించు చిట్టీ! ఇలాంటి విష యాల్లో హేస్టీనెస్ పనికిరాదు." అన్నయ్య క్రింద కెళ్ళిపోయాడు. వెన్నెలా - నేనూ - కొబ్బరిచెట్టూ - మిగిలాం. భాస్కరం తనకు నచ్చిన మాట వాస్తవమే కావచ్చు! అంత మాత్రంచేత అతన్ని చేసుకోవాలా? అసలు తన ఆశయాల్ని అతడు గౌర విస్తాడని నమ్మకం ఏమిటి? ఈ పెళ్ళి చేసుకోక తప్పదా ? తప్పించుకొని ఏం చేయాలి ? వీణ అన్నట్లు ఉద్యో గము చేసి సంపాదించుకున్న తర్వాత తన గమ్యం ఏమిటి ?

శశిఅన్నయ్య అడిగాడు. "నిర్ణ యానికి వచ్చావా ?"

"నాన్నగార్కి ఇష్టమేనా ?"

"నీవు తప్ప అందరూ అంగీక రించారు."

"నాన్నగార్కి ఇష్టమే! - అమ్మకీ ఇష్టమే!!-నీకూ ఆమోదయోగ్యమయి నప్పుడు నా అయిష్టతకు ప్రాధాన్యత ఏది? మీ ఇష్టప్రకారమే కానివ్వండి!"

అన్నయ్య బాధగా చూశాడు. "చిట్టీ! నువ్వు పొరబడుతున్నావమ్మా!



నీ శ్రేయస్సుకన్నా మేం వాంఛించే దేముంది? నీవు అన్ని విధాలా సుఖపడటమే - మేము కోరుకునేది. భాస్కరం నా ఫ్రెండ్ అవటం మూలాన నిన్నింత బాధపెట్టవలసి వచ్చింది. క్షమించు!"

మనసు కలుక్కుమంది. నా వల్ల అందరూ కష్టపడుతున్నారు! అంతా తన క్షేమాన్నే కాంక్షించినప్పుడు సందేహించటం దేనికి?

తన ముఖ్యమైన ఆశయం జాబ్ చేయటం! దాని కతడు ఇష్టపడ్డప్పుడు తనకు అభ్యంతరం దేనికి?

అన్నయ్య టెన్నిస్ ఆటకు క్లబ్‌కు పోతున్నాడు. "మేడమీదికి వస్తావా!"

డాబా పైకి నడిచాం. సిగ్గుదొంతరలు ముంచుకొస్తున్నా స్పష్టంగా చెప్పాను: "భాస్కరం నాకు నచ్చిన మాట వాస్తవమే! కాని నే నతనితో కొన్ని విషయాలు మాట్లాడాలి."

"అలాగే; రేపు సాయంత్రం బీచ్‌కి రమ్మని చెబుతాను."

"నిజం, చెప్పు అన్నయ్యా! ఈవూరు నువ్వే అతన్ని పిలిపించావా!"

"లేదు! శలవులకు అతని ఫ్రెండ్ ఇంటికి వచ్చాడు."

అన్నయ్య పెదవుల మీద స్నిగ్ధ మందహాసం!

సాయంత్రం వంటిరిగా బీచికెళ్లాను. భాస్కరం కన్పించలేదు. మనసు ఆందోళిత మయింది, 'తను ఇలా కోరటంలో తప్పు లేదుకదా! అవును అతని దృష్టిలో స్త్రీకి ఎంత విలువ వున్నదో తెలుసుకోవటం ముఖ్యం. అంత్య నిష్ఠురంకన్నా - ఆది నిష్ఠురమే

మేలు! అతనూ అందమైనవాడే. చక్కటి ఉద్యోగం తనూ సంపాదించవచ్చు! పొరపొచ్చాలు లేమీ అంటకుండా–అన్యోన్యంగానే గడిచిపోతాయేమో రోజులు!–అలా అని ఎందుకనుకోవాలి? పైకి ఎంతో సౌమ్యంగా కన్పించినా, లోపల పాషాణహృదయులు ఎంతమందిలేరు? రూపం చూసి మోసపోకూడదు! భవిష్యత్ సుఖమయం చేసుకోవా లనుకుంటే ముఖాముఖీ మాట్లాడుకోవటమే శ్రేయస్కరమేమో?' ఆలోచనల్లోంచి తేరుకుంటూ అతని కోసం నలుమూలలా కలయజూశాను. దూరాన మెల్లగా నడిచి వస్తున్న భాస్కరం నా దృష్టి నాకర్షించాడు. మల్లెపువ్వులాంటి తెల్లటి లాల్చీ–పైజమాలో, నిండుగా వున్నాడు.

"నాకోసం చాలాసేపు వెయిట్ చేస్తున్నారా?"

"లేదు! ఇప్పుడే నేను వచ్చింది!"

అతనుసముద్రంకేసిచూస్తూకూర్చున్నాడు. నా దృష్టిని సముద్రంకేసి మరల్చాను. ఉవ్వెత్తున అలలు లేస్తూ అందంగా ఊగుతోంది కడలి ఆ నీలి రంగు నీళ్ళల్లో అతిగాంభీర్యం గోచరిస్తున్నది. అందుకే మానవుని మనస్సుతో పోల్చివుంటారు!–నా ఆలోచనలు పూర్తి గాకమునుపే అన్నాడతడు–"మీ సందేహ మేమిటి?" చిరునవ్వు నవ్వుతున్నాడు. ఏమని అడగాలో తోచక కొన్ని క్షణాలు సందిగ్ధంలో పడ్డాను.

"స్త్రీలపట్ల మీ అభిప్రాయం ఏమిటి?"

"ఏ విషయంలో?"

"పురుషులతో సమాన హక్కులు సంపాదించటం––"

"హక్కులయితే సాధించగలరేమో! కాని పురుషులతో సమానం స్త్రీ ఎన్నటికీ కాజాలదు! అఫ్‌కోర్స్–అలాంటి విజయం సాధించాలని కోరుకునేవాళ్ళలో నేనూ ఒకడిననుకోండి! వత్సలాదేవి! మీ అభివృద్ధిని నేనెప్పుడూ కాంక్షిస్తూనే వుంటాను!"

అంటే అతని దృష్టిలో నేను స్త్రీని కానా? కోపంతో వళ్ళు దహించుకుపోయింది. సంబాళించుకుని "గృహస్థ విషయాల్లో కొన్నిట్లో స్త్రీకి స్వతంత్రత వుండటం ఔచిత్యమేనా?–శాంతస్వరంతో అడిగాను

"కొన్నిట్లోనేకాదు–అన్నిట్లోనూ వుండటం ఔచిత్య మంటాను."

"పురుషుల విమర్శలు ఏభావంతో గ్రహించాలి?"

"మంచీ–చెడూ వివక్షతా–ఎదుటిమనిషి ఎలాంటి మనస్తత్వం కలవాడో తెలుసుకుని దాన్నిబట్టి గ్రహించాలి." నవ్వు వచ్చింది అతని యుక్తి మెచ్చుకోతగ్గదే. చీకట్లు

హృదయానికి అద్దంలాంటి డైరీ వ్రాసుకోవటంకూడా అపరాధమే!'' నైరాశ్యం - విరక్తి శరీర మంతటా వ్యాపించింది. అను వీల్లేదు అన్నాడు. తనేం అనగల్గింది? ఎందుకని అనలేక పోయింది? అతనికి విధేయతగా వుండా లనా? ఈ మన స్తత్వం స్త్రీజాతి కంత టికీ వున్నదా? ఈ అలుసే తీసుకుని అలా రెచ్చిపోతున్నారేమో! స్త్రీ అబల కాదు సబలే! అని నిరూపించు కుంటున్నారే! ఇంకా ఈ వైషమ్యాలు సమసిపోవే! అసలు నిజంగా స్త్రీ పురోభివృద్ధిసాధించిందా? ఏ విధంగా? పురుషులతో సమానంగా ఉద్యోగాలు చేస్తున్నారు, సంపాదిస్తున్నారు, ఇతర కార్యకలాపాల్లో మెలగుతున్నారు. కాని అసలైన పురుషుల మనస్తత్వాల్లో మార్పు తేగలిగారా? వాళ్ల దృష్టిలో వైవిధ్యం కల్గిందా? లేదు వెకు కటిలా తమ అధికారాన్ని ప్రదర్శి స్తూనే వున్నారు తమ అహంభావా లను వెళ్ళగ్రక్కుతూనే వున్నారు. ''స్త్రీల అభివృద్ధిని కాంక్షిస్తున్నాం'' అంటూనే వేరొక ప్రక్క హేళనగా మాట్లాడుతున్నారు. ''గృహావసరా లకు స్త్రీ సంపాదించటం ఎంతో అవ సరం" అని ఉపన్యాసా లిస్తూనే - వేదిక దిగిన వెంటనే "ఎందుకండీ! వీళ్ళకు ఉద్యోగాలూ-వంటఇంట్లో పడి వుండక!'' అనే ప్రబుద్ధులు ఎంత మందో! ముఖ్యమైన పురుషుల దృక్ పథంలో మార్పు తేలేని స్త్రీ నిజంగ ఏం సాధించినట్లు?" ఆఫీసులో ... నుండి మాటలు విసిరే గుమాస్తాల గుర్తుకువచ్చారు. ఆలోచనలతో తల పగిలిపోతోంది. నా ఆలోచనలు ... ధోరణిలో సాగుతున్నాయేమిటి చెంపలమీద ముత్యాల్లా కన్నీళ్ళు రాలుతున్నాయ్. ఉన్నత పథాలు ఊహించుకోవడం, ఎన్నో ఆశయాలు సాధించాలని అనుకోవటం, అన్నీ వమ్మైనప్పుడు కొడిగట్టిన దీపంలా జీవితాంతం నిరాశ, నిస్పృహాలతో కృంగిపోవటం - నిజంగా మానవు మస్తిష్కం ఎంత విచిత్రమైంది!" వికలమైన మనస్సుతో అలాగే కూర్చుండిపోయాను.

3

డైరీ మూసింది. మనస్సు చిక్క బట్టుకుంది. కళ్ళల్లో నీళ్ళు నిలవటంలేదు. మొన్న జరిగిన సంఘటన గుర్తు కొచ్చింది. మధ్యాహ్నం 6 గంటలకే వచ్చాడు ఇంటికి భాస్కరం తలుపు తెరిచింది వత్సల

"అలా వున్నారేం?" మామూలుగా పలకరించింది వత్సల.

"తల నెప్పిగావుంటే శలవు పెట్టి వచ్చాను'' ముభావంగా అన్నాడు. సంభాషణ పెంచకుండా తన పనిలో లీనమయింది వత్సల. రాత్రి అలవాటు

ప్రకారం డైరీ వ్రాయబోయింది. ప్రన మౌనమోవచ్చి డ్రాయర్ సొరుగు లోక తొంగి చూసింది. అన్నీ కెలికి వున్నయ్. భాస్కరం చదువలేదుకదా! ఛ! అత నెందుకు చదువుతాడు? తన భ్రమ! మనసును సరిబుచ్చుకుంది. మరునాడు భాస్కర్ ప్రవర్తనతో తన అనుమానం నిర్ధారణ చేసుకుంది.

"నా మాటంటే నీకు లక్ష్యం లేదా?" విసురుగా అన్నాడు. తెల్లపోయింది.

"డైరీ వ్రాయవద్దంటే వినవేం?"

విపరీతమైన అసహ్యం ఈగుస్తో మొహం ఎఱ్ఱనైంది. సమాధానం చెప్పబోయింది.

"వెధవ వ్రాతలూ నీవూ!" మాట వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు. కష్టంగా అయిపోయింది వత్సల. భాస్కరమేనా ఇతను? తనతో అనురాగ సంభాషణలు చేసే అతనివేనా ఈ చీదరింపులు! ఆమె ఆశ్చర్యంలోంచి తేరుకోక ముందే దుఃఖం ముంచుకొచ్చింది. హృదయభారం తీరేలా వెక్కి వెక్కి ఏడ్చింది. ఇది జరిగింది క్రిందటిరోజు!.

"ఇంతమటుకు అతని ప్రవర్తనలో మార్పేంలేదు." గత స్మృతులతో అల్లకల్లోల మయింది మనసు. డైరీ చదవటమే తప్పు! పైగా నాకు ఆ హక్కు లేదా అంటాడేం? వ్రాసుకోవటానికి తనకుమాత్రం హక్కు లేదా? భాస్కరం ప్రవర్తన ఒక సమస్యలాగావుంది. తనలోకి ఒక్కసారి చూసుకుంటే తన లోపాలూ-తప్పులూ స్పష్టంగా కన్పిస్తాయి. అలా చేయకపోతే పోనీ — ఇతరులనైనా వివేచనా దృష్టితో పరిశీలించడేం!

తనకు సిగరెట్ వాసన గిట్టదు. మానుకుంటానని ప్రామిస్ చేశాడు. కాని అలవాటును మానుకోగలిగాడా? తనలోని లోపాలు వెలికి రాకూడదు. ఇతరులను చిత్రవధ చెయ్యాలి. ఏం మనిషి?

'అతన్ని ప్రయోజనం ఏమిటి? తన దురదృష్టం' తన జాతకఫలం! అంతే! ఉద్యోగం! డైరీ!! వీటిలో ఉద్యోగం ఏనాడో వదులుకుంది అలాగే ఈ డైరీ! జరిగిన సంఘటనలు ఆత్మవిమర్శ చేసుకుని బాధపడటము దేనికి? ఇంత మనస్తాపానికి కారణం ఈ డైరీ! దీనికోసం సంసారం అల్లకల్లోలితం కావటం అనవసరం. ఈ సంఘటనలవల్ల అతని బలహీనతలు బయటపెట్టుకున్నాడు. తన ఆధిక్యత ప్రదర్శించుకున్నాడు. వీటిని తగలబెడితేనే అతనికి శాంతి — అంతేగా! ఆవేశంతో పిచ్చెట్టినదానిలా అన్నీ కుప్పగాపెట్టి నిప్పంటించింది అగ్ని వర్ణం మంటలు భగభగ మంటున్నయ్ ఆ జ్వాలల్లో అంతర్జ్వాలను చల్లార్చే శాంతి కోసం వెతుక్కుంటూ కూర్చుండిపోయింది వత్సల.